క్లుప్తంగా

మంగళగుంటపాలెంలో వైద్య సేవలు



రోగి నుంచి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ మాధురి

నరసాపురం రూరల్: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మాధురి కోరారు. మండలంలోని మంగళగుంటపాలెంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 78 రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని లేవలేని స్థితిలో ఉన్న రోగులను, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది మాధురి, జి.సునీత తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్

పాలకొల్లు సెంట్రల్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్కానింగ్, డాక్యుమెంటేషన్ అన్నీ సక్రమంగానే ఉన్నాయని జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణ సబ్ రిజిస్ట్రార్‌పై వచ్చిన ఆరోపణలపై కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రోజు చేసిన పరిశీలనలో ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. అవినీతి ఆరోపణలు చేసిన వ్యక్తులను, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తులను విచారణ చేశామని తాము ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని మాకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వలేదని తెలిపారని వెంకటేశ్వరరావు చెప్పారు. దీనిపై ఇంకా పూర్తివిచారణ చేయనున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ సుధారాణి పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి



పెనుగొండ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. గురువారం పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించిన 2025–26 సంవత్సరానికి గానూ ఉపాధి పనులను గుర్తించడానికి నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. పెనుగొండలో 75 పనులు నిర్వహించడానికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి రత్నాకరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



వడలిలో సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెనుగొండ: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం వడలి పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రికార్డులు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని, అదేవిధంగా పారిశుద్ధ్యంపైనా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. వర్షాలతో దోమల వృద్ధిచెందే అవకాశం ఉంటుందని, దీనితో విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. వీటి నివారణకు చర్యలుతీసుకోవాలని సూచించారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీకమాసం నేపథ్యంలో నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి బయలుదేరే ఈ బస్సులు సోమవారం ఒక్క రోజులునే అన్ని క్షేత్రాలను దర్శించి తిరిగి నరసాపురానికి చేరుకుంటాయని వివరించారు. నవంబర్ 3,10,17,24 తేదీల్లో నరసాపురం బస్టాండ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరతాయన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. అలాగే శబరిమల, శ్రీశైలం వెళ్లే యాత్రీకులకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు.ఈ అవకాశాన్ని మాలదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడు సేవల్లో ఘనం.. నేడంతా అయోమయం

- కూటమి పాలనలో నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- తెరుచుకోని పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్







యలమంచిలి మండలం నారినమెరకలో ఒకే ప్రదేశంలో నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్

యలమంచిలి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను మాయం చేసిన కూటమి సర్కార్.. సచివాలయాల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుంది. జగనన్న పాలనలో సచివాలయాల ద్వారా 541 సేవలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అంతా గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంత వరకు తెరచుకోలేదు. ఫలితంగా అనేక మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ఫలాలు అందక అవస్థలు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

నాడు కూటమి ప్రభుత్వం నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ ప్రస్తుతం కూటమి సర్కారు పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కయ్యారు. అంతేకాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కూడా స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి, ఇంటింటిప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికి వచ్చిన అబద్ధపు హామీలను నేతలు ప్రజలకు వాగ్దానాలు చేసి గదెనెక్కిన కూటమి సర్కార్ సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కింది. వాటి అమలుపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారో? ప్రశ్నిస్తారోనని రోజుకొక సమస్యను సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు కళకళ.. నేడు వెలవెల

గత ప్రభుత్వం రెండు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.17.94 పాల కేంద్రాలు ఏర్పాటు చేసింది. కొన్నినెలలక్రితంవరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోక లతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 68 గ్రామ పంచాయతీలు, 31 వార్డులలో 67 సచివాలయాలు ఉండగా అందులో 562 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఉద్యోగులు పని లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. కేవలం నెల ప్రారంభంలో పింఛన్లు పంపిణీ మాత్రమే చేయిస్తోంది. సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచిపోవడంతో కార్యాలయాలకు ప్రజలు రాక వెలవెలబోతున్నాయి.

కనకాయలంక గ్రామానికి చెందిన రాజేష్‌కు 2020 ఆగస్టు 5వ తేదీన వివాహమైంది. అనంతరం అతను కొత్త రేషన్‌కార్డు కోసం సచివాలయంలో ఆగస్టు 25న దరఖాస్తు చేసుకోగా అదే రోజు సాయంత్రం కొత్త రేషన్ కార్డు మంజూరైంది.

పెదలంక గ్రామానికి చెందిన సుబ్బారావు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరాడు. అయితే అతనికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఉచిత వైద్య సేవలు అందించలేమని వైద్యులు తేల్చి చెప్పారు. ఆందోళనకు గురైన అతని కుటుంబ సభ్యులు వెంటనే విషయాన్ని వారి వలంటీర్ రోఖ్యాకు చెప్పారు. సత్వరమే స్పందించిన వలంటీర్ అతని పేరును ఆరోగ్యశ్రీ కార్డులో నమోదు చేయించి, ఆన్‌లైన్ చేశారు. దీంతో ఉచిత వైద్యం పొంది పూర్తి ఆరోగ్యంగా ఇంటికి చేరాడు. ఇదీ వలంటీర్, సచివాలయ వ్యవస్థ వలన సామాన్య ప్రజలకు గత ప్రభుత్వంలో జరిగిన మేళ్లు..

మాదకద్రవ్యాలు, పొగాకుపై అవగాహన



ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావును అభినందిస్తున్న ఛాంబర్ కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: మన ముందు తరం ప్రజలు ఎంతో నిబద్ధతతో జీవన విధానం కొనసాగించడం వల్ల నేడు ఇంత అభివృద్ధితో ముందుకు వెళుతున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిఐ మద్దాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మాదకద్రవ్యాలు, పొగాకు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేడు అందరూ తెలిసి చేస్తున్న తప్పుల వల్ల భావితరంలో అభివృద్ధి కుంటుపడుతుందని తద్వారా కుటుంబాలు నాశనం అవుతాయని అన్నారు. రోజురోజుకూ మద్యపానం సేవించే వారి సంఖ్య పెరిగిపోతుందన్నారు. అనుభవం కోసమో, సరదాకోసమో, పందేలు కోసమో మాదకద్రవ్యాలు వాడడం మొదలుపెడితే వాటిని వదిలించుకోవడానికి చాలా కష్టమవుతుందని సూచించారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య, పొగాకు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, అకాడమిక్ చైర్మన్ నందుల సీతారామారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాంబాబు, మాదవిలత, కెమిస్ట్రీ ఇన్‌చార్జ్ జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మూడు నెలలకోసారి పంచాయతీలను తనిఖీ చేయాలి



డీఎల్‌పీఓ ఐ.జ్యోతిర్మయికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ఈఓపీఆర్‌డీలు

పాలకొల్లు అర్బన్: ప్రతి మూడు నెలలకు ఒక సారి అన్ని పంచాయతీలను తనిఖీ చేసి సంబంధిత నివేదికలను తనకు అందజేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.జ్యోతిర్మయి సూచించారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని యలమంచిలి, పోడూరు, నరసాపురం, ఆచంట, మొగల్తూరు మండలాల్లోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీల సమీక్షా సమావేశంలో జ్యోతిర్మయి పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగింపు, పన్నులు, పన్నేతరాల డిమాండ్ 24–25కి సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నెలకు రెండు సార్లు ఓహెచ్ఎస్ఆర్ శుభ్రపరచాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అన్నింటినీ మనుగడలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీలు తాళ్ల మూర్తిబాబు, కేఎం వైభవతి, నవీన్‌కుమార్, జేడీవీ ప్రసాద్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా విద్యార్థులకు బొంద రత్నరాజు స్మారక చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల పోటీలకు హాజరుకావాలని ఆయన కోరారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు సమీప జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో చిత్రలేఖన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలు రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి విభాగంలో ప్రాథమిక పాఠశాల స్థాయి 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు, రెండవ విభాగంలో ప్రాథమికోన్నత స్థాయి 6, 7, 8, తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరికీ మాత్రమే అవకాశం ఉంటుందని వివరించారు.

తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు



మొగల్తూరులో నిలిచిన వాహనాలు



మొగల్తూరులో జాతీయ రహదారిపై వాహనాలు

మొగల్తూరు: జాతీయ రహదారి మరమ్మతుల పేరిట మొగల్తూరు ప్రధాన రహదారి పనులు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిని విస్తరించడంతో భారీ వాహనాలు, బస్సులు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించడంతో మొగల్తూరుకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పాయని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గత కొద్దిరోజులుగా రహదిరి మరమ్మతులు చేయడంతో కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. గతంలో మొగల్తూరు ప్రధాన రహదారి నుంచి భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతుండేది. ముఖ్యంగా నాలుగు రోడ్ల కూడలి అయిన స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో వ్యాపారాలు విస్తరించి ఉన్నాయి. సరుకులు కొనుగోలుకు వచ్చే వారంతా దుకాణాలకు ఎదురుగానే వాహనాలు నిలుపుతారు. వీటితో పాటు ఎగుమతి, దిగుమతిలకు వచ్చే వాహనాలు, ఆటోలు రోడ్డుపైనే నిలిపివేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. భారీ వాహనాలు, లారీలు, బస్సులు, ఆటోలు, ట్రక్ ఆటోలు వందలాదిగా తిరుగుతుండటంతో నాలుగు రోడ్ల కూడలి అయిన గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బయటపడాలంటే పద్మవ్యూహాన్ని దాటుకుని రావాల్సి ఉండేది. ఈ కష్టాలు జాతీయ రహదారి విస్తరణతో తీరాయి.

రహదారి మరమ్మతులతో ఇబ్బందులు

ఇటీవల జాతీయ రహదారిలోని వై–జంక్షన్ నుంచి మొగల్తూరు లాకు వరకు విస్తరించిన ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేపట్టారు. గతంలో విశాలంగా ఉన్న రహదారి వెడల్పును తగ్గించడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే మార్గం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి కుచించుకుపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, గతంలో ఉన్న వెడల్పునే రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారం



యలమంచిలి: కలగంపూడిలో వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పి.డేవిడ్‌సన్



యలమంచిలి: కలగంపూడిలో వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పి.డేవిడ్‌సన్

పెనుగొండ: గ్రామ సభలు ద్వారా భూ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు పెనుగొండ డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ తెలిపారు. గురువారం నడిపూడిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సభలో మొత్తం 46 దరఖాస్తులు వచ్చినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

కలగంపూడిలో..

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు గురువారం కలగంపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ గ్రామ సభలో రీ–సర్వేలో భూ సమస్యలపై రైతులు ఏ విధంగా దరఖాస్తు చేయాలో అవగాహన కల్పించారు. రైతులు ఎవరికైనా విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నా, జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ చేయాల్సి ఉన్నా అందరు తప్పకుండా ఈ నెల 30లోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ కోసం 6 దరఖాస్తులు, మ్యూటేషన్ కోసం 3 దరఖాస్తులు, విస్తీర్ణం సవరణ 3 మొత్తం 12 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ పొత్తూరి విష్ణు ప్రియ, ఉప సర్పంచ్ పి.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ పి.డేవిడ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం

నరసాపురం: పట్టణం సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌ఫామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల పాతిర మొక్కలు లేకుండా పాడైయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహాల పరిశీలన



హాస్టల్ విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి పి. విజయ దుర్గ

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా జడ్జి పి. విజయ దుర్గ బలుసుమూడిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలను సందర్శించి పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కంటి సమస్యలు, దంత సమస్యలు, వినికిడి సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంస్థకు తెలియజేస్తే సంబంధిత నిపుణులతో పరీక్షలు చేయిస్తామన్నారు. అనంతరం స్థానిక ఎల్ఐసీ ఆఫీసు ప్రక్కన ఉన్న బీసీ గవర్నమెంట్ కాలేజి విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించి పిల్లల్ని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు బైక్ సైలెన్సర్ తీసి శబ్దాలు చేసుకుంటూ హాస్టల్ మీదుగా తిరుగుతున్నారని, ఈ సమస్యను అరికట్టవలసిందిగా న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. న్యాయమూర్తి వన్ టౌన్ పోలీస్ వారికి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించారు.

ధరలను నియంత్రించాలి

భీమవరం: పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. గురువారం భీమవరంలో పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కర్రా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరల భారంతో సామాన్య ప్రజలే కాకుండా మధ్యతరగతి ప్రజలకు కూడా అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలను తక్షణం నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించినా అమలు శూన్యమని విమర్శించారు. సమావేశంలో సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, జేఎన్‌వి గోపాలన్ పాల్గొన్నారు.

నేటి నుంచి పెనుగొండ–పెరవలి రహదారి మూసివేత



ఐతంపూడి వద్ద ఛిద్రమైన రహదారి

పెనుగొండ: రహదారి విస్తరణ పనుల నిమిత్తం పెనుగొండ పెరవలి రహదారిలో శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. పెనుగొండ పెరవలి రహదారి గతంలో విస్తరణ పనులు జరిగాయి. అయితే పెనుగొండ పెరవలి రహదారిలో ఇరగవరం మండలం ఐతంపూడి, ఏలేటిపాడులవద్ద సాంకేతిక కారణాలతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో రాకపోకల రద్దీతో రహదారి కాస్తా పూర్తిగా ఛిద్రంగా మారింది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోయింది. తణుకు, నిడదవోలు, విజయవాడ వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో కిలోమీటరు మేర రహదారి భారీ గోతుల మయంగా మారింది. కిలోమీటరు ప్రయాణం చేయడానికి కనీసం 20 నిముషాలకు పైగా సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం విస్తరణ పనులు పూర్తయితే, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు తప్పుతాయి.

దారి మళ్లింపు

పెరవలి వైపు వెళ్లే వాహనాలు అన్ని పెనుగొండ మండలం సిద్ధాంతం మీదుగా పెరవలి వైపు మళ్లిస్తున్నారు. తణుకు వెళ్లేవారు ఆలమూరు మీదుగాను వెళ్ల వచ్చని అధికారులు తెలిపారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత



మూడు చక్రాల సైకిల్ పంపిణీ చేస్తున్న కాపు సర్వీస్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ సభ్యులు దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ పంపిణీ చేశారు. మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన రేపూరి వెంకటగిరి (అబ్బులు)కు బాల్యం నుంచి పోలియో ఉంది. ప్రభుత్వం ఇచ్చిన మూడు చక్రాల సైకిల్ పాడవ్వడంతో అతను బయటకు వెళ్లలేని పరిస్థితి. అతని పరిస్థితిని గ్రామానికి చెందిన కటారి నాగేంద్ర కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్లబ్ సభ్యులంతా స్పదించి ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని అబ్బులుకు మూడు చక్రాల సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మదన్, కార్యదర్శి వేరుకొండ దుర్గా ప్రసాద్, సభ్యులు కటారి నాగేంద్ర, జక్కంపూడి కుమార్, యర్రంశెట్టి వెంకటరత్నం, మండెల ఫణి, పక్వావుల రవి, యినుకొండ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో చెరువు చిచ్చు

ఆకివీడు: కూటమి నాయకులకు కొండయ్య చెరువు చిచ్చుపెట్టింది. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కొండయ్య చెరువులో డంపింగ్ యార్డు ఏర్పాటుకు నగర పంచాయతీ తీర్మానం చేసింది. అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 6.22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండయ్య చెరువును డంపింగ్ యార్డుగా మార్చేందుకు చేసిన తీర్మానానికి టీడీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీలోని కొంత మంది కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కూటమిలోని జనసేన కౌన్సిలర్లు ఇద్దరు, వైఎస్సార్‌సీపీలోని ఐదుగురు కౌన్సిలర్లు తీర్మానాన్ని వ్యతిరేకించి, సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలని, చట్టానికి లోబడి ప్రజా ప్రతినిధులు పని చేయాలని సూచించారు. మంచి నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చెరువును చెత్త వేయడానికి మరల్చడం సరైన విధానం కాదని జనసేన వ్యతిరేకించింది. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పూర్వీకులు ఏర్పాటు చేసిన చెరువును సద్వినియోగం చేసుకోకుండా వ్యర్థాల కోసం చెరువు ప్రాంతాన్ని నిర్వీర్యం చేయడం భావ్యం కాదని జనసేన కౌన్సిలర్లు, నాయకులు భావిస్తున్నారు. దీనిని ఎమ్మెల్యే దృష్టికి, పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డు తీర్మానాన్ని అమలు చేయకుండా చేయాలని యోచిస్తున్నారు. దీంతో కూటమి నాయకుల మధ్య చెరువు కుంపటిగా మారింది. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు తలలు పట్టుకుంటున్నారు. చెరువు తీర్మానం అమలును రద్దు చేయాలని మూకుమ్మడిగా పోరాడాలని టీడీపీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అయితే ఇరుపార్టీల నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చే దాఖలాలు కన్పించడంలేదు. ఇదిలా ఉండగా అజెండాకు తీసుకువచ్చిన చెరువు తీర్మానం అంశంపై కమిషనర్ వివరణ ఇవ్వాల్సి ఉంది. అజెండాలోని తీర్మానం అంశంతో పాటే చెరువు ప్రాంతాల్ని పూడ్చకూడదని, ఆక్రమణలు చేపట్టకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఉందని నోట్ రాయాల్సి ఉండగా ఏకపక్షంగా అజెండాను తీసుకువచ్చారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. గతంలో గ్రామంలోని ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు గట్టుపై వేసిన షెడ్డు నిర్మాణాన్ని 2011లో అప్పటి బోర్డు లోని ఉపసర్పంచ్, కొంత మంది సభ్యులు ఆమోదం తెలపడంతో హైకోర్టు ఆగ్రహించి, ఉపసర్పంచ్, ఆమోదం తెలిపిన సభ్యులను సస్పెండ్ చేసింది. తదనంతరం తీర్మానం చేయడం తప్పేనని సస్పెండ్ చేసిన సభ్యులు కోర్టుకు తెలిపి క్షమాపణ కోరడంతో సస్పెన్షన్ ఎత్తివేసింది. ప్రస్తుతం కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చాలని చేసిన తీర్మానంపై రానున్న రోజుల్లో ఏఏ చర్యలుంటాయోనని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.